



కొడితాడు ఆసరాతో గరుడపతాకం ధ్వజస్తంభం పైకెగసింది. నింగిలో రెపరెపలాడుతూ సకల దేవతా గణానికి స్వాగతం పలికింది. భక్తజనం జయజయనాదాల నడుమ బ్రహ్మోత్సవాల సంబరం ఆరంభం అయింది. తిరుమల కొండంతా దీపకాంతులతో కళకళలాడుతుండగా సీఎం చంద్రబాబు నెత్తిన పట్టు వస్త్రాలు పెట్టుకుని ఊరేగింపుగా కుటుంబంతో కలిసి ఆలయానికి వెళ్లి రాష్ట్రప్రభుత్వం తరపున శ్రీనివాసుడికి సమర్పించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి రాత్రి పెద్దశేషవాహన సేవలో పాల్గొన్నారు. సాంస్కృతిక దళాల ఆటపాటల నడుమ సాగిన వాహనోత్సవం భక్తకోటికి కనువిందు చేసింది.

తిరుమలేశుని దివ్యోత్సవం



అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవం ప్రారంభం

బ్రహ్మోత్సవాలలో నేడు

ఉదయం : 8 - 10 గంటల మధ్య చిన్నశేష వాహనం	రాత్రి : 7 - 9 గంటల మధ్య హంస వాహనం

చిన్నప్పటి నుంచీ శ్రీవారిని చూస్తూ పెరిగా. ఏ కష్టం వచ్చినా ఆయనపైనే భారం వేస్తా. బ్రహ్మోత్సవాల్లో 14 సార్లు పట్టువస్త్రాలు సమర్పించే అవకాశాన్ని వేంకటేశ్వరస్వామి నాకు ఇచ్చారు. ఇది ఎవరికీ దక్కని అవకాశం. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో, దేశంలోని అన్ని రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు ఉండాలి. స్వామివారికి అతిపెద్ద సంపద శ్రీవారి సేవకులే.

- పట్టువస్త్రాల సమర్పణ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజైన బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పెద్దశేష వాహనంలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఏడు తలల స్వర్ణశేష వాహనంపై పరమపద వైకుంఠనాథుడి అలంకారంలో మాడవీధుల్లో ఊరేగారు.రాత్రి 9 నుంచి 11 గంటల మధ్య మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, కళాబృందాల ప్రదర్శనలు, గోవింద నామస్మరణల నడుమ పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడు దర్శనమిచ్చాడు. అంతకుముందు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి నారా లోకేశ్ దంపతులు, అలాగే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ వాహన మండపంలో ఉత్సవర్లను దర్శించుకున్నారు.అర్చకులు వారికి హారతి ఇచ్చి శఠగోపంతో ఆశీర్వదించారు.వాహన సేవలో మాడవీధులు సాంస్కృతిక కార్యక్రమాలతో మార్మోగాయి. కోలాటాలు, డప్పువాయిద్యాలు, చెక్కభజన బృందాల నడుమ వివిధ దేవతామూర్తుల అలంకరణలతో కళాకారులు పాల్గొన్నారు.తొలిరోజు వాహనసేవలో భక్తుల రద్దీ తక్కువగానే కనిపించింది.

ఆగమోక్తంగా ధ్వజారోహణం

శ్రీవారి ఆలయంలో బుధవారం సాయంత్రం 5.43 - 6.15 గంటల మధ్య మీనలగ్నంలో జరిగిన ధ్వజారోహణ ఘట్టంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సమక్షంలో వేదగానాలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ ధ్వజపటాన్ని ఎగురవేసి సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

శ్రీవారిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బుధవారం రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఉప రాష్ట్రపతికి సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. అనంతరం మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లిన రాధాకృష్ణన్ ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపలకు వచ్చి అప్పటికే వాహన మండపంలో ఉన్న సీఎం చంద్రబాబుతో కలిసి పెద్దశేషవాహనంపై ఉన్న ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.



బాబు వెనుకే తమన్

తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) :పట్టువస్త్రాలు సమర్పించడానికి వచ్చిన సీఎం చంద్రబాబు వెంటే సంగీత దర్శకుడు తమన్ ఉండటం హాట్‌టాపిక్‌గా మారింది. సీఎం రాకముందే తమన్ వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లారు. కొంత సమయానికే వెలుపలకు వచ్చి అఖిలాండం నుంచి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం కుటుంబసభ్యులతో కలిసిపోయారు. ఆ తర్వాత బయోమెట్రిక్ నుంచి తిరిగి ఆలయంలోకి ప్రవేశించారు. సాధారణంగా ఇలా బయోమెట్రిక్ నుంచి ప్రవేశించడం నిషేధం. అయితే వీవీఐపీతో వచ్చిన కొందరికి ఈ వెసులుబాటు ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పసుపులేటి హరిప్రసాద్ మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లడం విమర్శలకు దారి తీసింది.

పార్వతీదేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ





చిత్తూరు గిరింపేటలో లలితాదేవి అలంకారంలో దుర్గాంబ

చౌడేపల్లె,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దసరా మహోత్సవాల్లో రెండవ రోజైన బుధవారం బోయకొండ గంగమ్మ పార్వతీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి రెండు చేతుల్లో కమలాలు, ఇంకో చేతిలో శివలింగం, మరో చేయి అభయ హస్తంగా స్వర్ణాభరణాలతో పార్వతీదేవిగా అలంకరించి, ధూపదీప నైవేద్యం సమర్పించారు. డార్మిటరి హాల్లో ప్రత్యేకంగా అమ్మవారి ఉత్సవ మూర్తిని అలంకరించి, కళశ స్థాపన చేశారు.





ప్రైవేటు బస్సు బోల్తా

- 22మందికి గాయాలు

పూతలపట్టు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):బెంగళూరు నుంచి తిరుపతి వస్తున్న ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడిన ప్రమాదంలో 22 మంది ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.అర్ధరాత్రి కారుచీకట్లో బస్సు బోల్తాపడడంతో ప్రయాణికులు ఆందోళనక గురై ఆర్తనాదాలు చేశారు.అవి విన్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంఘటనాస్థలానికి పరుగులు తీశారు. ఎన్‌ఎల్ 01-బి2169 నెంబరు గల గ్రీన్‌లైన్ ట్రావెల్స్ బస్సు మంగళవారం రాత్రి బెంగళూరు నుంచి 26 మంది ప్రయాణికులతో తిరుపతికి బయలుదేరింది.పూతలపట్టు మండలం గోపాలకృష్ణాపురం సమీపాన మంగళవారం రాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో అతివేగంతో బస్సు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మునిరాజు, శ్యామ్‌సన్, వెంకటరమణ, అరుణ్‌కుమార్, ఉదయ్, మునిసోమేష్, ఫైమా, పుష్పవతి, సౌభాగ్య, భారతి, దివ్యశ్రీ, సంజన్, సంపూర్ణ, లత, సునీత, కృష్ణమూర్తి, లవ, లక్ష్మి, మోహిత్‌రాజ్, శ్రీనివాసులు, వినయ్, లీలావతి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చిత్తూరు అభివృద్ధికి వేగంగా అడుగులు



చిత్తూరులో బుధవారం గాంధీ రోడ్డు అభివృద్ధి పనుల్ని పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

చిత్తూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. హైరోడ్డును విస్తరించే క్రమంలో మున్సిపల్ అధికారులు విడతల వారీగా ఆక్రమణల్ని తొలగిస్తున్నారు. తాజాగా గాంధీ రోడ్డు అభివృద్ధి కోసం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బుధవారం ఈ పనుల్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. ఈ రోడ్డులోని విద్యుత్తు స్తంభాలను, ఆక్రమణలను కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏసీపీ నాగేంద్ర తొలగింపజేశారు.ఇటీవల కట్టమంచి బైపాస్ పనులకు ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్ శంకుస్థాపన చేయగా, 3 నెలల్లో ఈ పనులు పూర్తి కానున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి చిత్తూరుతో పాటు కుప్పంలోనూ కేంద్రీయ విద్యాలయాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటయ్యేనా?

అసెంబ్లీలో మరోసారి కోరిన ఎమ్మెల్యే ● కృషి చేస్తామన్న మంత్రి నారా లోకేశ్

చిత్తూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బుధవారం అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.జిల్లాల విభజన తర్వాత ప్రముఖ యూనివర్సిటీలు, విద్యాసంస్థలు కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో చేరిపోగా చిత్తూరు జిల్లాకు చెప్పుకోదగ్గ విద్యాసంస్థ ఏదీ లేదు. అప్పటి నుంచి చిత్తూరు వాసులు జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మొదలు పెట్టారు. ఎన్నికల సమయంలో పెద్దఎత్తున సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఆ మేరకు ఎమ్మెల్యే జగన్మోహన్ గతేడాది నవంబరులో సీఎం చంద్రబాబును కలిసి యూనివర్సిటీ ఏర్పాటు చేయమని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. ఉన్నత విద్యా శాఖ అధికారులను కలిసి ప్రాసెస్ గురించి తెలుసుకున్నారు. ఈ క్రమంలో చిత్తూరులోని పీవీకేఎన్ కాలేజీలో యూనివర్సిటీ ఏర్పాటు చేసే అవకాశాలున్నాయని అవగాహనకు వచ్చారు. దీంతో సుమారు రూ.30 లక్షల సొంత నిధులతో పీవీకేఎన్‌లో మౌలిక వసతులు కల్పించి న్యాక్ గ్రేడ్ వచ్చేలా చేశారు. వర్సిటీ ఏర్పాటుకు ఈ గ్రేడ్‌ను కూడా ప్రామాణికంగా తీసుకుంటారు. తాజాగా బుధవారం అసెంబ్లీలో వర్సిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. మంత్రి నారా లోకేశ్ బదులిస్తూ యూనివర్సిటీ ఏర్పాటు తమ బాధ్యతగా భావించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



యూనివర్సిటీ అనేది చిత్తూరు వాసుల చిరకాల కల. 115 ఏళ్లుగా జిల్లా కేంద్రంగా ఉన్న చిత్తూరులో చెప్పుకోదగ్గ విద్యాసంస్థలు లేవు. వున్న ఉన్నత విద్యాసంస్థలన్నీ జిల్లాల విభజనతో తిరుపతిలో ఉండిపోయాయి. ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే చిత్తూరు నియోజకవర్గంలోని విద్యార్థులతో పాటు జిల్లా విద్యార్థులకూ ఉపయోగపడుతుంది. గతేడాది సీఎంను కలిసి కోరగా ఆయన మాటిచ్చారు. చిత్తూరులోని పీవీకేఎన్ కాలేజీలో వంద ఎకరాలకు పైగా స్థలం ఉంది. అన్ని సౌకర్యాలు కల్పించి దీనికి న్యాక్ ఏ గ్రేడ్ కూడా తీసుకొచ్చాం. చిత్తూరుతో పాటు పొరుగున ఉన్న మూడు నియోజకవర్గాల్లో 57కుపైగా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు, 13 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. 13వేల మంది ఇంటర్, 7 వేల మంది డిగ్రీ విద్యార్థులు చదువుతున్నారు. చిత్తూరుకు నలువైపులా హైవేలు ఉండడం, బుల్లెట్ ట్రైన్ కూడా మంజూరైన క్రమంలో ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తే భవిష్యత్తు తరాలకు మంచి చేసేలా మన ప్రభుత్వం చరిత్రలో మిగిలిపోతుంది.

- ఎమ్మెల్యే జగన్మోహన్



ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గారు గతేడాది నవంబరులో సీఎంకు లేఖ రాశారు. చిత్తూరు నియోజకవర్గంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. విభజన తర్వాత చిత్తూరులో ప్రభుత్వం తరపున ద్రావిడ, ప్రైవేటు అపోలో యూనివర్సిటీలు మాత్రమే ఉన్నాయి. సీఎం ప్రతి జిల్లాలో కనీసం ఓ ప్రైవేటు లేదా ప్రభుత్వ యూనివర్సిటీ ఉండాలని మాకు సూచించారు. ద్రావిడ యూనివర్సిటీ అనేది భాషాభివృద్ధి కోసం ఏర్పాటు చేసింది. చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు మా బాధ్యతగా భావించి చర్యలు తీసుకుంటాం.

- మంత్రి నారా లోకేశ్



బ్రహ్మోత్సవాలకు నాంది పలికిన

పల్లవరాణి సామవై



చిత్రం: సింగంపల్లి సత్యనారాయణ

తిరుమల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టింది పల్లవరాణి సామవై. క్రీ.శ.966లో ఆమె వెండితో రూపొందించిన భోగశ్రీనివాసమూర్తిని ఆలయంలో ప్రతిష్టించారు. మూల విగ్రహానికి సామ్యంగా అమరిన ఈ ఉత్సవమూర్తిని మనవాళ పెరుమాళ్ అనేవారు. వైభవోపేతంగా సాగిన ఆనాటి ప్రతిష్టాపన క్రతువే తిరుమల ఉత్సవాలకు నాంది అని అంటారు. ఏడాదికి రెండు బ్రహ్మోత్సవాలు జరిగేలా సామవై నిర్ణయించి జరిపించారు. 10వ శతాబ్దం దాకా ఏటా రెండు బ్రహ్మోత్సవాలు జరిగినట్టు ఆధారాలున్నాయి. తొమ్మిదిరోజుల వేడుకలు ఆమె ప్రారంభించినవే. 966 ఆగస్టు 27న మొదలైన ఈ వేడుకలే తొలి పురటాసి బ్రహ్మోత్సవాలు. ఉత్సవ మూర్తికి పల్లవరాణి అనేక ఆభరణాలను కూడా సమకూర్చారు. ఉత్సవాలకు రథాలు ఏర్పాటు చేశారు. శ్రీవారి మూలవిరాట్టు పాదాల చెంత పద్మపీఠానికి అనించి ఉంచిన భోగశ్రీనివాసుని భక్తులు దర్శించవచ్చు.



శ్రీవారి సేవలో ఉపరాష్ట్రపతి

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బుధవారం రాత్రి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకోగా సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. మహ ద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లిన ఆయన స్వామిని దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబుతో కలిసి వాహన మండపంలో పెద్దశేషవాహనంపై ఉత్సవమూర్తులను దర్శనం చేసుకున్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.2.85 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,837


తలనీలాలు సమర్పించినవారు: 20,904







శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో చంద్రబాబు కుటుంబీకులు.. సీఎంతో బోర్డు చైర్మన్, సభ్యులు, అధికారులు



నాడు : 1970ల నాటి ధ్వజారోహణం



నేడు : బుధవారం జరిగిన ధ్వజారోహణం









బుధవారం రాత్రి పెద్దశేష వాహన సేవ ముందు కళా ప్రదర్శనలు



ఊరేగిన ధ్వజపటం

ధ్వజారోహణానికి ముందు తిరుమల మాడవీధుల్లో ధ్వజపటం ఊరేగింపు వైభవంగా జరిగింది. గరుడకేతన ప్రతిష్ఠ, కంకణధారణ, ఆలయ ఆవరణంలో జరిగాయి. బయట అష్టదిక్కుల్లో అర్చకులు బలి నివేస్తూ ఆలయం ముందుకు వచ్చారు. వారి వెనుకనే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి, అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమంతులను, ధ్వజపటాన్ని మాడవీధుల్లో ఊరేగిస్తూ సకలదేవతామూర్తులకు ఆహ్వానం పలికారు. అనంతరం ఉత్సవమూర్తులతో పాటు ధ్వజపటాన్ని ఆలయంలోకి తీసుకువెళ్లి ధ్వజారోహణం నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







ఫల, పుష్ప ప్రదర్శన శాల ప్రారంభం

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ ఫల, పుష్ప, ఫొటో ప్రదర్శన. కల్యాణవేదిక వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను, రాంభగీచా-2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను బుధవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, శాంతారామ్, నరేష్‌కుమార్, జంగా కృష్ణమూర్తిలతో కలిసి పలు స్టాల్స్‌ను సందర్శించారు. ఏర్పాటు చేసిన వివిధ శాఖలను అభినందించారు. సీపీఆర్వో రవి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ రేణుదీక్షిత్, ఎస్వీ శిల్ప కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుష్ప ప్రదర్శన శాలలో 90 వేల మొక్కలు

వివిధ రంగుల్లో 18 రకాల జాతులను ప్రదర్శనకు ఉంచారు. కూరగాయలు, పండ్లు, పుష్పాలతో రూపొందించిన జంతువులు, పక్షుల బొమ్మలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. ఆనందనిలయ విమాన వేంకటేశ్వరుని మోసుకెళుతున్న మహాగరుడుడు సైకత శిల్పాన్ని బెంగుళూరుకు కళాకారిణి గౌరి రూపొందించారు. మూడు యుగాలకు సంబంధించిన 14 ఘట్టాలను కళ్లకుకట్టినట్టు చూపేలా ప్రతిమలను ఏర్పాటు చేశారు. మ్యూజిక్, డైలాగులు వినిపించడం వీటి ప్రత్యేకత. టీటీడీ గార్డెన్ విభాగం అధికారులు రూపొందించిన ఘటోత్కచ, బకాసుర, సురస, ద్రౌపతి స్వయంవరం వంటి పురాణ నేపథ్య పుష్ప అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయుర్వేద, అటవీశాఖల స్టాల్స్, శిల్పకళాశాలల స్టాల్స్ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. టీటీడీ పబ్లికేషన్స్ విభాగం అగరబత్తి స్టాల్‌ను ఏర్పాటు చేసింది.







ద్రౌపది స్వయంవరం



ఫలపుష్ప ప్రదర్శన శాలలో ఏర్పాటు చేసిన 'ద్రౌపది స్వయంవరం' సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా దర్శనమిస్తోంది. గతేడాది 'సీతా స్వయంవరం' స్థానంలోనే దీనిని ప్రస్తుతం ఏర్పాటు చేశారు. 20 రోజుల పాటు 20 మంది నిపుణులు 60 అడుగుల వెడల్పు, 39 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ సెట్టింగ్ కోసం కృషి చేశారు.



ఎగ్జిబిషన్ ప్రారంభించి పాత చిత్రాలు తిలకిస్తున్న బీఆర్ నాయుడు

పాత చిత్రాల విందు

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో తిరుమల, తిరుపతికి సంబంధించిన పాత ఫొటోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 1940 నుంచి భిన్న ప్రదేశాల్లో భిన్న సందర్భాల్లో తీసిన ఫొటోలు ఇందులో ఉన్నాయి. ఒకే ప్రదేశం నాడు-నేడు అంటూ ఏర్పాటు చేసిన ఫొటోలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

మూలస్థాన ఎల్లమ్మకు వెండి గజ వాహనం



వెండి గజ వాహనం

చంద్రగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మకు రూ.కోటి విలువైన వెండి గజ వాహనం వితరణగా అందింది. చంద్రగిరికి చెందిన జీఆర్ విజయరాఘవులు, బేబిరాణి, జీఆర్ చక్రపాణి, సత్యనాయణన్, హేమావతి వితరణగా అందించారు. దీని బరువు 75 కిలోలు. వినాయక స్వామి ఆలయంలో గజవాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొని వాహనాన్ని మోశారు. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, సింగిల్ విండో చైర్మన్ రాజులుగారి వినోద్‌రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, నాయకులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వెండి గజ వాహనాన్ని తీసుకువస్తున్న ఎమ్మెల్యే నాని, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

తిరుపతిలో తెలంగాణ యువకుడి హత్య

- రైలు పట్టాల పక్కన ఘాతుకం



సతీష్‌కుమార్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆర్‌గొండ గ్రామానికి చెందిన తమన్నగారి సతీష్‌కుమార్ (23) తిరుపతిలో బుధవారం మధ్యాహ్నం హత్యకు గురయ్యారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని రైలు పట్టాల పక్కన ఈ ఘాతుకం జరిగింది. తిరుపతి రైల్వే సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. ఆర్‌గొండ గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ ఒక్కడే కుమారుడు. ప్రైవేటు విద్యాసంస్థలో పీఈటీగా పనిచేస్తున్న ఇతడికి ఏడాది కిందట వివాహమైంది. గత ఆగస్టు నెలలో వివాహ వార్షికోత్సవం జరిగింది. తర్వాత ఆయన భార్య అలిగి వెళ్లిపోయింది. తర్వాత పీఈటీ ఉద్యోగాన్ని మానేసిన సతీష్‌కుమార్ ఖాళీగా ఉన్నారు. ఈనెల 22న కామారెడ్డి నుంచి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. ఆర్టీసీ బస్టాండు వద్దనున్న ఓ దుకాణంలో మద్యం తాగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో గానీ బుధవారం మధ్యాహ్నం దాదాపు 12.30 గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన, 91-40 విద్యుత్ స్తంభం వద్ద దుండగులు పగులకొట్టిన మద్యం సీసాతో ఇతడి గొంతు కోశారు. వారి నుంచి తప్పించుకున్న సతీష్ కొంత దూరం పరుగెత్తు కుంటూ వెళ్లి కింద పడి మృతి చెందినట్లు అక్కడి పరిస్థితులను బట్టి తెలుస్తోంది. పట్టాల పక్కన మృతదేహం ఉన్న విషయాన్ని కొందరు రైల్వే ప్రయాణికులు రైల్వే ఎస్ఐ రత్నమాలకు ఫోనుచేసి సమాచారమిచ్చారు. దీంతో రైల్వే సీఐ ఆశీర్వాదం, ఎస్ఐ ధర్మేంద్ర రాజు, తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ అధికారులు జయశ్రీ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రాజేష్‌గాంధీ, వేలిముద్ర నిపుణులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు ఉపయోగించిన మద్యం సీసా, పీఈటీగా పనిచేసిన ఐడీ కార్డు, ఆధార్, పాస్‌పోర్టు, రైలు టికెట్, సెక్యూరిటీ గార్డు పోస్టుకు సంబంధించి రెజ్యూమ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐడీ కార్డుల్లోని సెల్‌ఫోను నెంబర్ల ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. సాయంత్రం తిరుపతి రైల్వే ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ హత్యకు కారణం ఆయన గ్రామానికి సంబంధించి ఎవరితోనైనా ఆర్థిక లావాదేవీలా లేదా వివాహేతర సంబంధమా? లేకుంటే మద్యం మత్తులో స్థానికంగా ఘర్షణ పడటంతో హత్య చేశారా అనే కోణాల్లో రైల్వే సీఐ ఆశీర్వాదం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.

డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

మృతదేహం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు దగ్గర్లోని బార్ వద్దకు.. అక్కడ్నుంచి అంబేడ్కర్ విగ్రహం, మళ్లీ బస్టాండులోని వినాయక విగ్రహం వరకు పోలీస్ జాగిలం టైగర్ వెళ్లి ఆగిపోయింది. దీన్ని బట్టి హంతకులు హత్య చేశాక బస్సులో పారిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

స్విమ్స్‌లో 25 వేల గుండె చికిత్సలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రారంభించిన 32 ఏళ్లలో 25 వేల గుండె చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్‌లో 1993లో కార్డియాలజీ విభాగం స్థాపించగా, అదే ఏడాది క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మొదటి గుండె చికిత్సను 1994లో మొదలు పెట్టి ఇప్పటి వరకు 25 వేల గుండె చికిత్సలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. వీటిల్లో ఎన్టీఆర్ వైద్యసేవ, టీటీడీ ప్రాణదాన పథకాల కింద 85 శాతం పేదలకు ఉచిత చికిత్సలు అందించామన్నారు.

సైబర్ నేరగాళ్ల బురిడీ

- వృద్ధుడి ఖాతాలో రూ.1.58 లక్షలు హాంఫట్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సైబర్ కేటుగాళ్లు రోజుకో రూపంలో బురిడీ కొట్టిస్తున్నారు. తిరుపతికి చెందిన ఓ వృద్ధుడు తాజాగా వీరిలో వలలో చిక్కి రూ. 1.58 లక్షలు పోగొట్టుకున్నాడు. స్థానిక విజయనగర్ కాలనీకి చెందిన 65 ఏళ్ల వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి మూడు రోజుల క్రితం వాట్సాప్ కాల్ చేశాడు. ఇంట్లో ఉంటూనే చిన్న వ్యాపారం చేసుకుని సొమ్ము ఆర్జించవచ్చని నమ్మబలికాడు. తమ వాట్సాప్ నెంబరుకు హాయ్ అని పెడితే మిగిలిన వివరాలు పంపుతామన్నాడు. దీంతో బాధితుడు కుమార్తె ద్వారా హాయ్ అని పెట్టించాడు. వెంటనే సైబర్ మోసగాళ్లు మరో అడుగేసి బ్యాంకు ఖాతా,ఆధార్ వివరాలు పంపితే చిరు వ్యాపారానికి సంబంధించి పెట్టుబడి పంపుతామని బురిడీ కొట్టించాడు. సదరు వ్యక్తి వివరాలు పంపగానే బ్యాంకు ఖాతాలోని రూ.1.58 లక్షలు కాజేశారు. మొబైల్‌కు విత్‌డ్రా మెసేజ్ రావడంతో బాధితుడు లబోదిబోమంటూ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశారు.

బెడిసికొట్టిన అరెస్ట్ డ్రామా కాల్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కొడుకును అరెస్టు చేశామంటూ ఒక కళాకారుడికి టోపీ వేసేందుకు సైబర్‌నేరగాడు చేసిన విఫలయత్నమిది. ఎంఆర్‌పల్లికి చెందిన ఎమ్మాని వెంకటేశ్వర్లు అనే మ్యూజిక్ లెక్చరర్‌కు బుధవారం ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. ఎస్ఐ యూనిఫాంలో అతని డీపీ ఉంది. మీ హైదరాబాదులో ఉన్న కుమారుడ్ని ఒక కేసులో అరెస్ట్ చేశామన్నాడు. రూ.20వేలు ఫోన్‌పే ద్వారా పంపకపోతే బయటకు రాడంటూ బెదిరించాడు. అబ్బాయితో మాట్లాడించండని వెంకటేశ్వర్లు గట్టిగా గద్దించగా చిన్నబాబుది ఏడుపు స్వరం వినిపించాడు. తనకు హిందీ తెలియదని, ఇంగ్లిషులో మాట్లాడాలని వెంకటేశ్వర్లు రెట్టించేసరికి ఆ సైబర్ నేరగాడు డబ్బులు పంపుతారా లేదా అంటూ హెచ్చరించి ఫోన్ పెట్టేశారు. తన ఖాతాలో డబ్బులు లేకపోవడంతో నష్టం జరగలేదని వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతికి చెప్పారు.

కట్టమంచి బైపాస్ రోడ్డు పనులు వేగవంతం కావాలి

దొడ్డిపల్లె ఎన్‌టీఆర్ లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలి ● క్షేత్రస్థాయిలో పర్యటించి పలు సూచనలు చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చిత్తూరు పట్టణ పరిధిలోని కట్టమంచి బైపాస్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కార్పొరేషన్ పరిధిలోని గాంధీ రోడ్డు, కట్టమంచి బైపాస్‌రోడ్డు, దొడ్డిపల్లె ఎన్‌టీఆర్ హౌసింగ్ కాలనీ లేఅవుట్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు సంబంధించి గాంధీ రోడ్డులో పనులను వేగవంతం చేయాలన్నారు. రోడ్డుకిరువైపులా డ్రైనేజీ, విద్యుత్ స్థంభాలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. కట్టమంచి వై జంక్షన్ నుంచి మురుగానిపల్లె వరకు 1.1 కిలోమీటర్ల దూరం ఉన్న బైపాస్‌రోడ్డుకు బీటీ రోడ్డు పనులను వేగవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.50 లక్షలు, కలెక్టర్, చుడా, కార్పొరేషన్ నిధుల కింద మరో రూ.47 లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. అదే విధంగా 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.కోటిని అధనంగా రోడ్డునిర్మాణానికి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వారంలోపు జంగిల్‌క్లియరెన్స్ చేసి రెండు లేయర్లుగా రోడ్డు నిర్మాణం జరిగితే మన్నిక బాగుంటుందన్నారు. కోకావారిపల్లె రోడ్డును నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం దొడ్డిపల్లె లేఅవుట్‌కు వెళ్లిన కలెక్టర్ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించారు. దారి సౌకర్యం, తాగునీటి వసతిని ఏర్పాటుచేయాలని హౌసింగ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ నరసింహప్రసాద్, ఆర్డీవో శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం, ఈఈ శంకరప్ప, డీఈ శ్రీధర్, అర్బన్ తహసీల్దార్ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



దొడ్డిపల్లె ఎన్‌టీఆర్ లేఅవుట్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

మరమగ్గాలకు ఉచిత విద్యుత్‌పై నగరి ఎమ్మెల్యే ధన్యవాదాలు



నగరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చేనేత మరమగ్గ కార్మికులకు ఉచిత విద్యుత్‌ను అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిలో జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో బుధవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో 2019 నుంచి 2024 వరకు సమవస్త్రాల పంపిణీ పేరుతో జరిగిన అవకతవకల గురించి ఘాటుగా విమర్శించారు. నగరి చేనేత మరమగ్గ కార్మికుల అసోసియేషన్ పేరుతో అనుమతులు తీసుకుని ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి నగరి వాసులకు అన్యాయం చేశారని, దానిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు సమవస్త్రాల పంపిణీ విషయంలో చేనేత మరమగ్గ కార్మికులకు ఆప్కాబ్ ద్వారా అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. దీనిపై మంత్రి నారా లోకేష్ ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లయన్స్ క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- రూ.7 లక్షలతో నిర్మించిన ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం



ఆర్‌వో ప్లాంటును ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో రూ.7లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్‌వో ప్లాంట్‌ను బుధవారం లయన్స్ క్లబ్ గవర్నర్ అశ్వర్థనారాయణ, దాత వీవీ భానుమూర్తిరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు ప్రతి సోమవారం 300నుంచి 400మంది ప్రజలు వివిధ ప్రాంతాలనుంచి వస్తుంటారని, వీరికి ఉచితంగా స్వచ్ఛమైన నీటిని అందించే అవకాశం ఉందన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆర్‌వో ప్లాంట్ నిర్వహణకు, శుభ్రం చేయడానికి, ఇతర అవసరాలకు సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నపిల్లలకు ఉచితంగా, పెద్దవారికి నామమాత్రపు ఖర్చుతో కళ్లజోడు పంపిణీకి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరగా.. తప్పకుండా ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. దాత భానుమూర్తిరెడ్డి మాట్లాడుతూ ఆర్‌వో ప్లాంటు ఏర్పాటుకు అడిగిన వెంటనే స్థలాన్ని కేటాయించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలకు రూ.లక్ష చెక్కును లయన్స్‌క్లబ్ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్, ఏవో వాసుదేవన్, లయన్స్‌క్లబ్ ఛైర్‌పర్సన్ వాసుదేవరెడ్డి, సభ్యులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందంగా అమరావతికి

- 80 బస్సుల్లో బయలుదేరిన భావి ఉపాధ్యాయులు
- నేడు సీఎం చేతులమీదుగా నియామక పత్రాల స్వీకరణ



తిరుపతి(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీకి ఎంపికైన.. భావి ఉపాధ్యాయులు బుధవారం అమరావతికి పయనమయ్యారు. నియామక పత్రాలు అందుకునేందుకు వీరంతా ఉత్సాహంగా కదలివెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులందరికీ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నియామకపత్రాలు అందజేయనున్నారు. ఈనెల 18నే ఈ కార్యక్రమం జరగాల్సి ఉన్నా, భారీ వర్షాల వల్ల 25వ తేదీకి వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం నియామక పత్రాలు అందుకోవడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 1532 మందికి గాను 1484 మంది, వారి సహాయకులు మరో 1484 మంది 80 బస్సుల్లో బుధవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. అనారోగ్యం, ఇతర కారణాల వల్ల 48 మంది వెళ్లలేకపోయారు. వీరందరికీ 380 మంది రూట్ ఆఫీసర్లు మార్గదర్శకులుగా వ్యవహరిస్తారని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. అభ్యర్థులకు రూపాయి ఖర్చు కాకుండారవాణా, వసతి, ప్రభుత్వమే కల్పించిందన్నారు.

ఉదయం 5 నుంచే రిజిస్ట్రేషన్ : ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు వేకువజామున 4 గంటలనుంచే తిరుపతి- రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవడం మొదలు పెట్టారు. దీంతో ఉదయం 5 గంటలకే రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. 9.30 గంటలకంతా వీరి రిజిస్ట్రేషన్ పూర్తయింది. అల్పాహారం తీసుకున్నాక 10 గంటలకు అమరావతికి బస్సులు బయలుదేరాయి. అభ్యర్థులు, సహాయకులే కాకుండా వీడ్కోలు పలికేందుకు ఇతర కుటుబ సభ్యులుకూడా ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవడంతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది.

మధ్యాహ్న భోజనం: కొందరికి గూడూరు, మరికొందరికి నెల్లూరు
రాత్రి బస: గుంటూరు
డీఎస్సీకి ఎంపికైంది: 1532 మంది (మహిళలు 774, పురుషులు 758)
అమరావతికి వెళ్లింది: 1,484 మంది (మహిళలు 729, పురుషులు 755)
వివిధ కారణాలతో వెళ్లనివారు: 48 మంది
సహాయకులు: మరో 1,484 మంది
రూట్ ఆఫీసర్లు: 380 మంది
సిబ్బంది సహా మొత్తం: 3,368 మంది



గంజాయిపై ఉక్కుపాదం

- స్కూళ్ల సమీపంలోని దుకాణాలపై ప్రత్యేక నిఘా
- ఎస్పీ తుషార్ డూడి



పుంగనూరు పోలీసుస్టేషన్ వద్ద బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడి

పుంగనూరు రూరల్,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గంజాయి సాగు, రవాణా, వినియోగ వ్యాపారాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఎస్పీ తుషార్‌డూడి హెచ్చరించారు. బుధవారం పుంగనూరు పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించారు. సచివాలయ మహిళా పోలీసుల నుంచి సమస్యలను తెలుసుకుంటూ గ్రామాల్లోనే పరిష్కరించాలని సూచించారు. గంజాయి నిల్వలు, అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పాఠశాలలకు, కళాశాలలకు 100 నుంచి 500 మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద అనుమానాస్పద కదలికలు, నిషేధిత పదార్థాల విక్రయాలపై నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో బాల్యవివాహాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలని సీఐ సుబ్బరాయుడిని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి శాంతియుతంగా సమస్యలు తీర్చాలని సూచించారు.ఎస్పీ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.

గౌరిశెట్టిగారిపల్లిలో గజరాజుల బీభత్సం

కల్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజరాజుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ గౌరిశెట్టి వారిపల్లి వద్ద మంగళవారం రాత్రి వరి, వేరుశనగ, మామిడి, అరటి పంటలపై ఏనుగుల గుంపు దాడులు చేయడంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది. ముందుగా పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి మంగళవారం సాయంత్రం చీకటి పడే సమయానికే 8 ఏనుగుల గుంపు బయలుదేరాయి. పాతపాళ్యం అటవీ మార్గం పాతపేట మీదుగా చల్లావారిపల్లి సమీపానికి చేరుకున్నాయి. రాత్రి 7 గంటల సమయంలో కల్లూరు-సదుం రోడ్డును దాటుకున్న ఏనుగుల గుంపు చిట్టారెడ్డిపేట మీదుగా గౌరిశెట్టివారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలో వరి, కొబ్బరి, అరటి, మామిడి పంటలను ధ్వంసం చేశాయి. రాత్రంతా వరి పొలాల్లోనే తిష్ట వేసిన ఏనుగులు నానా బీభత్సం సృష్టించాయి. ఉదయం 5 గంటల వరకు ఏనుగుల గుంపు పొలాల్లోనే ఉండటంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం అడవిలోకి తిరుగు ముఖం పట్టాయి. ఉదయం ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటలను చూసిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వరి పంటలను ఏనుగుల గుంపు తీవ్రంగా నష్టం చేశాయని, పంటలకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట



ఏనుగులు తొక్కేసిన వరిపంటను చూపుతున్న రైతు - ధ్వంసమైన అరటి చెట్లు

మొసలిమడుగులో జంట ఏనుగుల దాడులు

పలమనేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం మొసలిమడుగు గ్రామ సమీపంలోని పంటలపై మంగళవారం రాత్రి జంట ఏనుగులు చేసిన దాడిలో వరి, అరటి, వంకాయల పంటలు ధ్వంసమయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు నాని, మురళీమోహన్, ఆదిమూలం, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి

సీఎంకు స్వాగతం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు తిరుచానూరు తాజ్ హోటల్ సమీపంలోని హెలిప్యాడ్ వద్ద మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఇందులో ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, మురళీమోహన్, ఆదిమూలం, సీఎం స్పెషల్ సెక్రటరీ ఎ.వి.రాజమౌళి, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, శాప్‌ఛైర్మన్ రవినాయుడు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు సుగుణమ్మ, నరసింహయాదవ్, డాలర్ దివాకర్‌రెడ్డి, హరిప్రసాద్, రుద్రకోటి సదాశివం, జేసీ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ ఉన్నారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నేత హరిప్రసాద్

సదరన్ డిస్కం సీజీఎంకు అభినందనల వెల్లువ

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం చీఫ్ జనరల్ మేనేజరు మురళీ కుమార్‌ను స్నేహితులు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు. జీఎం నుంచి సీజీఎం రెవెన్యూ విభాగానికి పదోన్నతి పొందిన ఆయన బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ క్రమంలో డిస్కం కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువలతో సత్కరించారు. అభినందించిన వారిలో జీఎంలు ఎం కృష్ణారెడ్డి, చక్రపాణి, టి.జయరాం, కె.వాసుదేవరెడ్డి, ప్రసాద్, విజయభాస్కర్, డి.బాబు, ఏఏవోలు శివశంకర్, మధు, విశ్రాంత సీజీఎం కేఆర్‌ఎస్ ధర్మజ్ఞాని, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, పలువురు విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు. కాగా, సీజీఎంగా వారం క్రితం పదోన్నతి ఆర్డర్ తీసుకున్న సి.సురేంద్రనాయుడు(ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్) ఆరోజే బాధ్యతలు తీసుకున్నారు.



మురళీకుమార్‌ను అభినందిస్తున్న స్నేహితులు, అధికారులు, ఉద్యోగులు

ఉత్తమ పంచాయతీలకు రూ.కోటి నజరానా

డిసెంబరులో ప్రకటించనున్న కేంద్రప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా చాలా పంచాయతీలు నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తొమ్మిది అంశాల్లో పురోగతి సాధించిన గ్రామ పంచాయతీలకు కేంద్రం రూ.కోటి బహుమతిగా అందించి ప్రోత్సహించనుంది. చాలా పంచాయతీల్లో తాగునీటి సమస్యతో పాటు మురుగుకాలువలు, రహదారులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను సూచికలో పొందుపరిచిన కేంద్రప్రభుత్వం ఇప్పటికే సర్పంచ్‌లకు,ఎంపీటీసీ సభ్యులకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చింది. డిసెంబరులో పురోగతి సూచిక ప్రగతిని గుర్తించి, బహుమతికి ఎంపికైన గ్రామాలను కేంద్రం ప్రకటిస్తుంది.ఆదర్శ పంచాయతీలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాయి. ఇందుకోసం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు.

తొమ్మిది అంశాలివే : ● గ్రామ పంచాయతీల్లో పేదరికం లేని జీవనోపాధిని పెంపొందించడం. ● ప్రజారోగ్యం, గ్రామ శ్రేయస్సును మెరుగుపరిచే కార్యక్రమాల అమలు ● ప్రజలకు స్వచ్ఛమైన నీరు పుష్కలంగా అందుబాటులోకి తేవడం ● పిల్లల సంరక్షణ, అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ● గ్రామాన్ని పరిశుభ్రంగా పచ్చదనంతో తీర్చిదిద్దడం ● మౌలిక సదుపాయాల కల్పన ● సామాజిక న్యాయాన్ని సురక్షిత వాతావరణంలో నెలకొల్పడం. ● శాంతియుతమైన, న్యాయమైన, బలమైన సంస్థలతో సుపరిపాలన ● పంచాయతీ సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య తదితర అంశాలు.

ఎస్వీయూలో పరిశోధన ప్రయోగశాల భవన నిర్మాణం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ భవనానికి వీసీ అప్పారావు బుధవారం శంకుస్థాపన చేశారు. పరిశోధన అవసరాల కోసం రూ.6 కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో దీన్ని నిర్మించనున్నట్లు వీసీ అప్పారావు తెలిపారు. పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలకు ఈ భవనం వేదిక కానుందని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ డీన్ నరసింహ, రూసా సీఈవో వంశీ, ఇంజనీర్ తాండవకృష్ణ, ప్రిన్సిపాల్ పద్మావతి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న వీసీ అప్పారావు తదితరులు

వచ్చే నెల 26వ తేదీవరకు 'సర్' కార్యక్రమం : కలెక్టర్



పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 'సర్ (స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్) కార్యక్రమం జిల్లాలో వచ్చేనెల 26వ తేదీవరకు కొనసాగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025తో 2002 ఓటరు జాబితాను మ్యాపింగ్ చేస్తూ గడిచిన 23 ఏళ్లలో ఎంతమంది ఓటర్లున్నారో 'సర్' కార్యక్రమం ద్వారా గుర్తించి వలసలు, మృతులు, పోలింగ్ స్టేషన్ల మార్పుల వివరాలను ముందస్తు చర్యగా గుర్తిస్తున్నామన్నారు. 2002లో సుమారు 10లక్షల మంది ఓటర్లు ఉండగా, 2025లో వారి సంఖ్య 15లక్షలకు పెరిగిందని వివరించారు. ఇప్పటికే చేపట్టిన ముందస్తు చర్యలో 25శాతం జాబితా సరిపోల్చి రాష్ట్రస్థాయిలో చిత్తూరు జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో 1776 పోలింగ్ స్టేషన్ల పరిధిలో బీఎల్వోలకు 'సర్' కార్యక్రమ నిర్వహణపై అవసరమైన శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. తమ దృష్టికి వచ్చిన బోగస్, మరణించిన ఓటర్ల వివరాలను బీఎల్వోలకు తెలిపి ఓటరు జాబితానుంచి తొలగింపులో సహకరించాలని రాజకీయపార్టీల ప్రతినిధులను ఆయన కోరారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్ (టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), యశ్వంత్ (జనసేన), గంగరాజు (సీపీఎం), పరదేశి (కాంగ్రెస్), ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ జేడీగా ఉమామహేశ్వరి



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఉమామహేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా పశుసంవర్ధక శాఖలో డీడీగా పనిచేస్తున్న ఈమెకు రాష్ట్ర ప్రభుత్వం జేడీగా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఆమె జేడీగా బాధ్యతలు చేపట్టారు.

ఈవీఎం గోదాము తనిఖీ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములను కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాము లోపల నియోజకవర్గాలవారీగా వేరుచేసిన ఈవీఎంల భద్రతను పరిశీలించి డీఆర్వో మోహన్‌కుమార్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్ (టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), యశ్వంత్ (జనసేన), గంగరాజు (సీపీఎం), పరదేశి (కాంగ్రెస్), ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ, ఐఆర్ ప్రకటించాలి: పీఆర్‌టీయూ

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, మధ్యంతర భృతి(ఐఆర్)లు ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నన్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. పెండింగ్‌లోని నాలుగు డీఏలు, పీఆర్‌సీ అమలు చేసే వరకు 30 శాతం మధ్యంతర భృతి(ఐఆర్)లు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లోని ఈఎల్స్, ఏపీజీఎల్ఐ, పీఎఫ్ లోన్లు తదితర ఆర్థిక అంశాలను పరిష్కరించాలన్నారు. దసరా సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలు చెల్లించడంతోపాటు డీఏను తక్షణం ప్రకటించాలని కోరారు.

టీడీపీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం



వెంకటరమణతోపాటు ఇతర నేతలను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల బాగోగులు చూసుకుంటూనే పార్టీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తాము కృషి చేస్తామని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనందరెడ్డి తెలిపారు. బుధవారం రామకుప్పం మండలం పచ్చారుమాకులపల్లెలో మునస్వామి, వెంకటరమణలను స్థానిక టీడీపీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి విషయంలో నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంతేకాకుండా సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పట్ర నారాయణాచారి, గంట్లప్పగౌడు, కృష్ణానాయక్, కామరాజనాయక్, నరసింహులు, సత్తి, చంద్రశేఖర్‌రెడ్డి, గుణశేఖర్, రామాంజులు, రవిరెడ్డి, మునీంద్రనాయక్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు దుస్తుల వితరణ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ప్రభాకర్ తదితరులు

పలమనేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని రిమ్మర్స్ దివ్యాంగుల పాఠశాలలో చదువుకొంటున్న విద్యార్థులకు బుధవారం పలమనేరు బీజేపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ దుస్తులు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలమనేరు బీజేపీ సీనియర్ నాయకులు నాయనివారి రామన్న, పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి ఎంటీఆర్ ప్రసాద్, ప్రస్తుత ప్రధాన కార్యదర్శి మోహన్ గుప్తా, బీజేపీ నాయకులు అనిల్, వెంకటాద్రి బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గంకొండలో భక్తుల శివమాలధారణ



దుర్గంకొండలో శివమాలధారణ చేసిన భక్తులు

సోమల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం దుర్గంకొండ గార్గేయ మునీశ్వరస్వామి కొలువుదీరిన ఆలయంలో బుధవారం పలువురు భక్తులు శివమాలధారణ చేశారు. ఆలయ అర్చకులు త్రివిక్రమశాస్త్రి ఆలయంలో అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పెద్దఉప్పరపల్లె, పేటూరు, బోనమంద, రెడ్డివారిపల్లె, బసవపల్లె, పట్రపల్లె తదితర గ్రామాలకు చెందిన భక్తులు శివదీక్షలు చేపట్టారు.

శివకురుబూరులో పశువైద్య సేవలు



పశువులకు చికిత్స చేస్తున్న వైద్యులు

శాంతిపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శివకురుబూరులో శాంతిపురం పశువైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పశు వైద్య సంయుక్త సంచాలకులు డాక్టర్ అబ్దుల్ అరిఫ్, సహాయ సంచాలకులు డాక్టర్ సతీష్ బాబు పశువులకు వచ్చే వ్యాధుల గురించి వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అనంతరం ఆవులకు, దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందులను వేశారు. కార్యక్రమంలో వైద్యులు ఆమని, జయశ్రీ, సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్, డైరెక్టర్ హరీష్ కుమార్, గోపాలమిత్ర కోఆర్డినేటర్ కలీఫా, రైతులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన టీడీపీ నేత సుబ్రహ్మణ్యంశెట్టి



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి బుధవారం విజయవాడలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. వి.కోట మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బుధవారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేయడంతో కార్యక్రమానికి హాజరైన సుబ్రహ్మణ్యంశెట్టి రంగనాథ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడును కలిసి సన్మానించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రేపు 'లోక్ కళ్యాణ్ మేళా'

కుప్పం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో కుప్పం పురపాలక సంఘంలో ఈనెల 26వ తేదీన 'లోక్ కళ్యాణ్ మేళా' నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. కుప్పం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ మేళాలో వీధి చిరు వ్యాపారులకు ఐడీ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. అలాగే పీఎంఎస్‌వీఏ నిధి 2.0 పథకం కింద కొత్త దరఖాస్తులు స్వీకరిస్తామని, ఇప్పటికే మంజూరు చేసిన దరఖాస్తుల రుణ పంపిణీని సులభతరం చేస్తామని, బ్యాంకు తిరిగి పంపిన కేటగిరీ కింద యూఎల్‌బీ వద్ద పెండింగులో ఉన్న దరఖాస్తులను ప్రాసెస్ చేస్తామని చెప్పారు. రుణ మంజూరు కోసం బ్యాంకుల వద్ద పెండింగులో ఉన్న దరఖాస్తులను ప్రాసెస్ చేస్తామని, లబ్ధిదారులకు డిజిటల్ ఆన్ బోర్డింగ్‌పై అవగాహన కలిగిస్తామని, ఎఫ్ఎస్ఎస్ఏఐ సమన్వయంతో వీధి ఆహార విక్రేత లబ్ధిదారులకు శిక్షణ ఇస్తామని, సామాజిక ఆర్థిక ప్రొఫైలింగ్ చేయడం, తొలగించబడిన లబ్ధిదారులు, వారి కుటుంబాలకు రుణాలను మంజూరు చేయడం వంటి అన్ని అంశాలు లోక్ కళ్యాణ్ మేళాలో మిళితమై ఉంటాయని కమిషనర్ వివరించారు.

వర్మీకంపోస్టు తయారీపై దృష్టి



డంపింగ్ యార్డును తనిఖీ చేస్తున్న ఎంపీడీవో ప్రసాద్

సోమల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డులకు చేరిన చెత్త నిల్వల నుంచి వర్మీకంపోస్టు తయారీ చేయడంలో కార్యదర్శులు నిర్లక్ష్యం వీడాలని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని నడింపల్లె పంచాయతీ కరకమంద డంపింగ్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లో సేకరించిన చెత్త నిల్వల నుంచి రైతులకు ఉపయోగపడే సేంద్రియ ఎరువులు తయారీకి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. నడింపల్లె, సూరయ్యగారిపల్లెల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న మానవ హక్కుల సంఘం, అవినీతి నిర్మూలన సంస్థ సభ్యులు

పలమనేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం మానవ హక్కుల సంఘం, అవినీతి నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పెద్దచెల్లారగుంట గ్రామ దళితులు నిరసన తెలిపారు. బైరెడ్డిపల్లి మండలం పెద్దచెల్లారగుంట గ్రామంలో దళితుల శ్మశానాన్ని ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలమనేరు ఆర్డీవో భవానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డీవీ మునిరత్నం, మణి, సోమరాజు, మహిళా నాయకురాలు సరస్వతి, నారాయణశెట్టి, శివ, వాణి, శాంతమ్మ, మనోహర్, రాజా, చిన్నా శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలను భాగస్వామ్యం చేయండి



నూతన ఎంపీడీవోను కలిసిన జనసైనికులు

సోమల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనసేన పార్టీ కార్యకర్తలకు ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు భూషణ్ రాయల్ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్‌ను జనసైనికులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ హరినారాయణ, ఏఎంసీ డైరెక్టర్ కైవారం మురళీ, మనోజ్, రామకృష్ణ, చాను, జాకీర్, సోమశేఖర్, ప్రసాద్, రఘు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే పీ-4 లక్ష్యం

కల్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజాన్ని రూపొందించడం కోసం ప్రభుత్వం ఏకైక లక్ష్యంతో పీ-4ను అమలు చేస్తోందని ఇన్‌చార్జి ఎంపీడీవో మునిరాజ తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. బంగారు కుటుంబాల ఎంపిక, మ్యాపింగ్, దత్తత విధానాలపై చర్చించారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

● వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చిన దేవతామూర్తులు



రామకుప్పం: అనిగానూరులో కన్యకాపరమేశ్వరి



రామకుప్పం: రుద్రావతారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి



గుడుపల్లె: అన్నపూర్ణ దేవి అలంకరణలో రాళ్లగంగమాంబ



పలమనేరు: సంతానలక్ష్మి అలంకరణలో సత్యగంగమ్మ



పలమనేరు: గంటాఊరులో గాయత్రి దేవి



సోమల: అలంకరణలో కందూరు కన్యకాపరమేశ్వరి

రామకుప్పం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవ రాత్రుల్లో మూడో రోజు బుధవారం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రామకుప్పంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, కాశీవిశ్వేశ్వరాలయం, అనిగానూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి, కంబాలదేవులపల్లె సప్తమాతృకా చౌడేశ్వరమ్మ ఆలయాల్లో ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

● **గుడుపల్లె:** మండలంలోని రైల్వే క్రాస్ సమీపంలో కొలువుదీరిన రాళ్లగంగమాంబ అన్నపూర్ణ దేవి అలంకణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు.

● **పలమనేరు:** దసరా ఉత్సవాల్లో భాగంగా పలమనేరు సత్యగంగమ్మ గుడిలో అమ్మవారు బుధవారం సంతానలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. గంటావూరు కాలనీలో అమ్మవారికి గాయత్రీదేవి అలంకరణ చేశారు. పాతపేట కనకదుర్గాదేవి ఆలయంలో అన్నపూర్ణేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు.

● **సోమల:** మండలంలో కందూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి కుంకుమ అలంకరణ చేశారు. పట్రపల్లె ఆలయంలో అమ్మవారికి గాయత్రిదేవి అలంకరణ, కందూరు పాలేటమ్మ వారికి విశేష అలంకరణ చేపట్టారు.

● **సదుం:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక జాండ్రపేటలోని రామలింగ చౌడేశ్వరి దేవి గాయత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గాండ్ల సంఘ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామదేవత సదుమమ్మ గజవాహనంపై ఊరేగారు.

● **చౌడేపల్లె:** బోయకొండ గంగమ్మ రెండో రోజు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● **పుంగనూరు:** స్థానిక కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో అష్టలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి.



సదుం: గాయత్రి దేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి



సదుం: గజలక్ష్మి అలంకరణలో సదుమమ్మ



చౌడేపల్లె: మూలస్థానం అమ్మవారు



పుంగనూరు : అలంకరణలో శ్రీవిరూపాక్షి మారెమ్మ



పుంగనూరు: అలంకరణలో చౌడేశ్వరీదేవి



చౌడేపల్లె : హోమం చేయిస్తున్న వేదపండితులు

కార్పొరేషన్ డైరెక్టర్లకు టీడీపీ నేతల సన్మానం





వి.కోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వి.కోట మండలం యడగురికి గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకులు గజేంద్ర బాధ్యతలు స్వీకరించారు. బుధవారం అమరావతిలోని జలవనరుల శాఖ కార్యాలయంలో రాష్ట్ర చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ నేతృత్వంలో ప్రమాణ స్వీకారం చేసి గజేంద్ర డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అలాగే విజయవాడలోని ఆటోనగర్‌లో రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ రావిళ్ల వెంకటేశ్వరరావు, కమిషనర్ రామాదేవిల సమక్షంలో రాష్ట్ర డైరెక్టర్‌గా మండల టీడీపీ అధ్యక్షులు ఏ.ఎం.రంగనాథ్ బాధ్యతలు తీసుకున్నారు. రాష్ట్ర డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గజేంద్ర, రంగనాథ్‌లను స్థానిక టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, పీఏసీఎస్ అధ్యక్షులు హరినాథరెడ్డి, నేతలు సుబ్బు, విశ్వేశ్వరావు, చందు, విశ్వనాథరెడ్డి, వెంకటేష్, నేతాజీ, జయచంద్రా, శివ, బాలాజీ, పొట్టు భాస్కర్ పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే తనిఖీ



పెద్దపంజాణి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్వామిత్వ సర్వేను జిల్లా పంచాయతీ అధికారి సుధాకరరావు తనిఖీ చేశారు. బుధవారం పెద్దపంజాణి ఎంపీడీవో కార్యాలయంలో ఆయన స్వామిత్వ సర్వేపై ఆరా తీశారు. మండలంలో జరుగుతున్న సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేను వేగవంతం చేయాలన్నారు. వివాదస్పద స్థలాలను పక్కన పెట్టి వివాదం లేని స్థలాలను సర్వే చేయాలన్నారు. ఈ పత్రాల ఆధారంగా బ్యాంకుల్లో సులభంగా రుణాలు పొందవచ్చని తెలిపారు. ఎంపీడీవో బాలాజీ, ఈవోఆర్డీ శారదాదేవి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

222 మందికి వైద్య పరీక్షలు

పెద్దపంజాణి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి మురళి 222 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీవో బాలాజీ, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ క్లీనిక్‌కు ఫ్రిజ్ విరాళం



చౌడేపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విలేజ్ క్లీనిక్‌కు నంజార్లపల్లెకు చెందిన దాతలు ప్రభాకర్‌నాయుడు, నరేష్ నాయుడు బుధవారం ఫ్రిజ్‌ను విరాళంగా అందించారు. డాక్టర్ మోనా, టీడీపీ నాయకుడు వేలూరు సుబ్రహ్మణ్యం, చంగలరాయులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో బీజేపీ జిల్లా అధ్యక్షులు



చౌడేపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మను బీజేపీ జిల్లా అధ్యక్షులు జగదీశ్వరనాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బుధవారం ఆయన అమ్మవారి దర్శనానికి రాగా ఆలయ ఈవో ఏకాంబరం ఆయనకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు కడియాల మనోహర్, నాయకులు మాదాస్ లోకేష్, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

దొమ్మరి కులస్తులను గిరిబలిజలుగా మార్చకండి



తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేస్తున్న రాయల్ పీపుల్ ఫ్రంట్ నాయకులు

పుంగనూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దొమ్మరి కులస్తులను గిరిబలిజలుగా మార్పుచేసి జీవో తీసుకురావడం సరి కాదని రాయల్ పీపుల్‌ఫ్రంట్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బలిజ కులస్తులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తహసీల్దార్ రాముకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోగం కులస్తులను సూర్య బలిజ, ఈడిగ కులస్తులను శెట్టిబలిజ, దొమ్మరి కులస్తులను గిరి బలిజగా జీవో తీసుకురావడం బలిజ కులస్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్ రాయల్, పూల త్యాగరాజు, నానబాల గణేశ్, మణి, బాలు, నానబాలకుమార్, చిన్నా, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రాజేశ్వరి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు సకాలంలో అందించాలని పుంగనూరు సీడీపీవో రాజేశ్వరి సూచించారు. పోషణ మాసోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని వనమలదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోకుండా కుటుంబ సభ్యులకు ఇవ్వడంతో రక్తహీనతకు గురవుతున్నారని.. తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్రీ, సూపర్‌వైజర్ సుగుణ, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



పుంగనూరులో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ టి.రాజశేఖర్



చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రిలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు



పలమనేరులో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పుంగనూరు రూరల్ , సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాగుణం అలవర్చుకోవాలని పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ టి.రాజశేఖర్ కోరారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

● **సోమల:** విద్యార్థులు సామాజిక సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మహాత్మాగాంధీ శత జయంతిని పురస్కరించుకుని 1969 సెప్టెంబరు 24న ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి కళాశాల ఆవరణలో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గౌతం, అధ్యాపకులు రామకృష్ణ, శివయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

● **కల్లూరు:** విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా సేవాగుణం అలవర్చుకోవాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తులసీరాం తెలిపారు. పులిచెర్ల మండలం కొత్తపేట నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంపై బాధ్యతగా వ్యవహరించాలని, అందరి కోసం అనే భావన ఏర్పరచుకోవాలని తెలిపారు.

● **సదుం:** విద్యార్థి దశ నుంచి సామాజిక సేవ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాస్వామి అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటనాథరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●**పలమనేరు:** పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ సేవా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు, అధ్యాపకులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆర్.వెంకటేష్ బాబు, డాక్టర్ పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.చిదంబరం, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నందీశ్వరయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బెనజీర్, డాక్టర్ ఇ.వాసు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** యువత సామాజిక బాధ్యత కలిగి ఉండాలని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్ర అన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక పీహెచ్‌సీలో పిచ్చి మొక్కలను శుభ్రం చేయించారు. ఎన్ఎస్ఎస్ పీవో బాలాజీ, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, రవికుమార్, ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు


ఉచిత కంటివైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు, చుడా చైర్‌పర్సన్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర వహిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని మేయర్ అముద చెప్పారు. స్వచ్ఛతాహీ సేవా 2025లో భాగంగా బుధవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల సేవలను మరువలేమన్నారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు అపోలో వైద్యులచే ఎనిమిది విభాగాల్లో వైద్య పరీక్షలు, చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. 348 మంది పారిశుధ్య కార్మికులు వైద్య సేవలు పొందారని, అవసరమైన వారికి మెరుగైన సేవలందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు రాజేష్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, ఏసీ ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర, అపోలో వైద్యులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన వరసిద్ధుడి ఆలయ చైర్మన్


చంద్రబాబుకు వినాయక స్వామి ప్రతిమను అందిస్తున్న మణినాయుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ చైర్మన్ మణినాయుడు మంగళవారం రాత్రి ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రితో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రెండోసారి ఆలయ చైర్మన్ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రికి ఆయన స్వామి ప్రతిమను బహూకరించారు.

మహిళా మోర్చా సేవా కార్యక్రమాలు


గిరింపేట స్కూల్లో ప్రకృతి సేద్యం కూరగాయల ప్రదర్శన

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సంకల్పం మేరకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద బీజేపీ ఆధ్వర్యంలో మహిళలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం స్థానిక గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రకృతి సేద్యంతో సాగు చేసిన కూరగాయల ప్రదర్శనతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గైనిక్, ఆర్థో, డెర్మటాలజీ, చిన్నపిల్లల, జనరల్, ఈఎన్‌టీ తదితర విభాగాలకు సంబంధించి వైద్య నిపుణులచే శిబిరం ఏర్పాటుచేశారు. సుమార్ 230 మందికి వైద్య పరీక్షలు చేసిన వైద్యులు అవసరమైన మేరకు మందులు అందజేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు సూపర్‌వైజర్ శైలు, వైద్య సిబ్బంది, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బాబు, సత్యనారాయణ, గోకుల్, మహిళలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏఎంసీ పాలకవర్గం



చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) సభ్యులు బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. రైతుల అభివృద్ధికి కమిటీ పాలకవర్గ సభ్యులు కృషిచేయాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్‌ను కల్సిన వారిలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, వైస్ చైర్‌పర్సన్ అనురాధ, సభ్యులు కె.బి. జయపాలన్, సయ్యద్ ఫిరోజ్, ఎంజీ హేమచంద్ర, అంజలి, మీనాక్షి, కె.గౌరి, ఇ.గోవిందస్వామి నాయుడు, ఎ.మోహన్ నాయుడు ఉన్నారు.

పోషణ మా కార్యక్రమం

వెదురుకుప్పం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో బుధవారం అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ మా కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ ఏర్పాటుచేసిన ఆహార పదార్థాల స్టాల్‌ను కత్తిరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి పరిశీలించారు. తర్వాత చిన్నపిల్లలకు పౌష్టికాహారాన్ని తినిపించారు.

తల్లిపాలు పిల్లలకు ప్రకృతి ప్రసాదం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పిల్లలకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని సీడీపీవో శ్యామసుగుణకుమారి చెప్పారు. బుధవారం వెంగళరావు కాలనీలో తల్లిపాల ప్రాముఖ్యత - అనుబంధ ఆహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. సీడీపీవో మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగ నిరోధక శక్తి, శిశువు మెదడు అభివృద్ధి చెందుతోందన్నారు. ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలను ఇవ్వాలన్నారు. ఆరు నెలల తరువాత తగిన అనుబంధ ఆహారం ఇవ్వాలని సూచించారు. తల్లులు తగినంత నీరు తాగడం, ఆహారాన్ని తీసుకుంటే పాలు సమృద్ధిగా ఉత్పత్తి అవుతుందన్నారు. సూపర్‌వైజర్ తోయజాక్షి, టీచర్ చిట్టెమ్మ, దివ్య భారతి, తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి ప్రజామరుగుదొడ్డి

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11వ తేదీన మండల కేంద్రమైన బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రజామరుగుదొడ్డి నిరుపయోగంగా ఉండడంతో 'కట్టారు... మరిచారు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం విదితమే. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజామరుగుదొడ్డిని వినియోగంలోకి తీసుకొచ్చారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, జంబువారిపల్లె సర్పంచు అమరమ్మ, వైస్ సర్పంచు కమలనాథ్‌రెడ్డి ప్రారంభించారు.

లలితాదేవిగా దుర్గమ్మ


చిత్తూరులో లలితాదేవి అలంకారంలో దుర్గమ్మ


సాయిబాబా ఆలయంలో వారాహిగా అమ్మవారు


కాణిపాకంలో రాజరాజేశ్వరీదేవిగా మరగదాంబిక


గాయత్రీదేవిగా బంగారుపాళ్యం ముత్యాలమ్మ


జీడీనెల్లూరులో రాజరాజేశ్వరిగా అల్లియెల్లమ్మ


బాలాత్రిపురసుందరిగా ఆరిమేని గంగమ్మ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని గిరింపేటలో వెలసిన దుర్గాంబ ఆలయంలో జరుగుతున్న దేవీ నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజైన బుధవారం లలితాదేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. కట్టమంచి సాయికృపా అపార్ట్‌మెంట్‌లోని సాయిబాబా ఆలయంలో అమ్మవారు వారాహి అలంకారంలో, రాములవారి గుడివీధిలో మత్స్య అవతారంలో కోదండరామస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. తేనెబండలోని ముత్యాలమ్మ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ● ఐరాల: కాణిపాక క్షేత్రంలో వెలిసిన మణికంఠేశ్వరస్వామి ఆలయంలో మరగదాంబిక అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించారు. రాత్రి మరగదాంబిక ఉత్సవ విగ్రహాన్ని అంగరంగ వైభవంగా కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ● నగరి: నగరిలో వెలిసిన నేత్రప్రదాయని క్షేత్రంలో దేశమ్మ అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి చంద్రగంట అలంకారంలో దర్శనమిచ్చారు. ఓంశక్తి ఆలయలో అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అంకరణ చేశారు. ● బంగారుపాళ్యం: బంగారుపాళ్యం గ్రామదేవత ముత్యాలమ్మ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ● గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరులోని అల్లియెల్లమ్మను రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు. ● శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురం మండలంలోని గంగమ్మగుడిలో బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో ఆరిమేని గంగమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ● పాలసముద్రం: బలిజకండ్రిగలో వున్న చెవిటిగంగమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా చెవిటిగంగమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ● వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం దేరాకండ్రిగలోని నైనేరమ్మ దేవస్థానంలో అన్నపూర్ణేశ్వరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్వేటినగరం స్కంధ పుష్కరిణి వద్ద ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా అలంకరణలో భక్తులకు కనిపించారు. ● వెదురుకుప్పం మండలం డీఆర్ఎస్‌కండ్రిగలోని కొండ మల్లీశ్వరస్వామి ఆలయ సముదాయంలో ఉన్న రాజరాజేశ్వరీ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులను కటాక్షించారు. జీటీకండ్రిగ వద్ద ఉన్న మూలస్థాన ఎల్లమ్మ, గుర్రంవారికండ్రిగలో దుర్గమ్మ ఆలయాల్లోనూ పూజలు చేశారు.


అన్నపూర్ణాదేవిగా పాలసముద్రంలో చెవిటిగంగమ్మ


దేరాకండ్రిగలో అన్నపూర్ణేశ్వరిగా నైనేరమ్మ


డీఆర్ఎస్ కండ్రిగలో అన్నపూర్ణదేవిగా రాజరాజేశ్వరీదేవి

మహిళ అదృశ్యం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి ఓ మహిళ, ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైంది. రెండో పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు కథనం మేరకు... నగరంలోని టెలిఫోన్ కాలనీలో గణేష్, భార్య నందిని, కుమారులు చేతన్, భవిత్ కలిసి ఉంటున్నారు. తరచూ భార్యభర్తల మధ్య గొడవ జరిగేది. రెండు రోజుల కిందట ఘర్షణ జరగడంతో భర్త ఇంట్లో లేని సమయంలో నందిని ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లిపోయింది. తెలిసిన వారు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేదు. దాంతో బాధితుడు గణేష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ ఆర్మీ ఉద్యోగిపై దాడి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉన్న ఓ మాజీ ఆర్మీ ఉద్యోగిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన బుధవారం నగరంలో జరిగింది. రెండో పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు వివరాల మేరకు.. నగరంలోని విజయలక్ష్మీకాలనీలో మాజీ ఆర్మీ ఉద్యోగి సూర్యప్రకాష్ కుటుంబం నివాసముంటోంది. కొన్ని రోజులుగా కుటుంబంలో ఘర్షణ జరుగుతోంది. ఈ క్రమంలో బుధవారం సూర్యప్రకాష్ ఇంట్లో ఉండగా ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి అతడిపై దాడికి పాల్పడ్డారు. అనంతరం చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో వారు పరారయ్యారు. గాయపడిన సూర్యప్రకాష్‌ను చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెగిన విద్యుత్ తీగలు


ఆర్కేవీబీపేట వద్ద తెగిన విద్యుత్ తీగలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట గ్రామానికి వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలు బుధవారం తెగిపడ్డాయని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో ఆ వైపు ఎవరూ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. విషయం తెలుసుకున్న కార్వేటినగరం విద్యుత్ శాఖ ఉద్యోగులు మరమ్మతు చర్యలు చేపట్టారు.

గ్రావెల్ ఓవర్ లోడ్‌తో టిప్పర్ బోల్తా


మహారాజపురం దళితవాడ వద్ద బోల్తా పడిన టిప్పర్‌ను పైకి తీస్తున్న దృశ్యం

విజయపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాజపురం నుంచి ఓవర్ లోడ్‌తో గ్రావెల్ తరలించడం వలన సమస్యలు తప్పడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిత్యం వందలాది టిప్పర్లలో గ్రావెల్ తరలించడం వలన రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, టిప్పర్లు బోల్తాపడి ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. బుధవారం సాయంత్రం టిప్పర్ మహారాజపురం దళితవాడ వద్ద బోల్తా పడిందని, దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వారు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ ముందుండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతా విజయులురెడ్డి

వెదురుకుప్పం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజ సేవ చేయడంలో నిరంతరం ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు ముందుండాలని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి అన్నారు. బుధవారం ఆ కళాశాలలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, డాక్టర్ గోమతి, హరిబాబు, రఘురాం, బాబు, ఈశ్వరరెడ్డి, మీనా, భార్గవి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవే ధ్యేయంగా ఎన్ఎస్ఎస్

నగరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజ సేవే ధ్యేయంగా ఎన్ఎస్ఎస్ పనిచేస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వేణుగోపాల్ అన్నారు. కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.భాస్కరరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.గోపి, ఐక్యూ కోఆర్డినేటర్ డా.ఇందిరా ప్రియదర్శిని, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డా.భాస్కర్, సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ డా.అరుణకుమారి, లాల్‌బాషా, కుమారి, శ్రీజోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కాళికాదేవి ఆలయ కుంభాభిషేకం


కుంభాభిషేక హోమంలో పాల్గొన్న ఉభయదారులు

చిత్తూరు సిటీ, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కట్టమంచిలో నూతనంగా నిర్మించిన సౌమ్య కాళికాదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక హోమ పూజలు బుధవారం వైభవంగా జరిగాయి. వేదపారాయణం, రుద్రాభిషేకం, చండీ యాగం, గోపుర శిఖర నవరత్న నిక్షేపణం తదితర పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. రాత్రి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహా మంగళ హారతి నిర్వహించారు.

శ్మశానానికి దారి కోసం
గ్రామస్తుల ధర్నా



రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు, గ్రామస్తులతో చర్చిస్తున్న ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ రవికుమార్, జాతీయ రహదారి అధికారులు

నగరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా మండలంలోని గుడికండ్రిగ గ్రామం వద్ద శ్మశానానికి వెళ్లే దారి మూసుకుపోవడంతో గ్రామస్తులు ఆగ్రహంతో రోడ్డెక్కారు. శ్మశానానికి మృతదేహాలను ఎలా తీసుకెళ్లాలో అధికారులే చెప్పాలంటూ తచ్చూరు జాతీయ రహదారిపై కూర్చుని బుధవారం ధర్నాచేశారు. రోడ్డు పనులకు వెళ్లే గ్రావెల్ టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై టిప్పర్లు సుదూర ప్రాంతం వరకు బారులుతీరాయి. సమాచారం అందుకున్న ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ రవికుమార్, జాతీయ రహదారి అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని నిరసనకారులతో చర్చించారు. ఇప్పటికే మూడుసార్లు ఈ అంశంపై తాము నిరసనలు తెలిపామని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమన్నారు. ఈ అంశంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తప్పనిసరిగా గుడికండ్రిగ వద్ద శ్మశానికి వెళ్లేందుకు గేటు వేసి దారి వసతి కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన గ్రామస్తులు నిరసన విరమించారు. ఆపై జాతీయ రహదారిపై వాహనాలు ముందుకు కదిలాయి. దేశమ్మ గుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోవిందరెడ్డి, వేణు, జయరాంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా?

● ఆస్తుల ధ్వంసం
● పట్టించుకోని యంత్రాంగం


ప్రభుత్వ భూమిలో ఎక్స్‌కవేటర్‌తో పనులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా ఆ స్థలంలో ఉన్న ఆస్తులను సైతం ధ్వంసం చేశారని, అదీ ప్రభుత్వ ఉద్యోగులేనని కార్వేటినగరం మండలం గాజంకి గ్రామస్తులు బుధవారం తెలిపారు. గాజంకిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలస్థితికి చేరడంతో అదనపు తరగతి గదులను మరో చోట నిర్మించి అక్కడికి పాఠశాలను కొన్నేళ్ల క్రితం మార్చారు. శిథిల భవనానికి ఎదురుగా మరుగుదొడ్లు నిర్మించగా, అక్కడే ఉన్న మినీ వాటర్ ట్యాంకు కూడా పాడైపోయి నిరుపయోగంగా మారిందని స్థానికులు తెలిపారు. ఆ ప్రాంతమంతా ప్రభుత్వ భూమి(గ్రామ కంఠం) సుమారు 15 సెంట్లు. అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఆ భూమిని ఆక్రమించుకుని ఎక్స్‌కవేటరు, ట్రాక్టర్లతో శిథిల వాటర్ ట్యాంకును, పాఠశాల మరుగుదొడ్లను ధ్వంసం చేసి చదును చేస్తున్నారని స్థానికులు తెలిపారు. నల్లమందును ఉపయోగించి ఆక్రమణ స్థలంలో ఉన్న రాళ్లను బ్లాస్టింగ్ చేస్తున్నారని చెప్పారు. గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా ఆస్తులను ధ్వంసంచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని స్థానికులు హెచ్చరించారు. ఈ విషయమై కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజును వివరణ కోరగా... ఆక్రమణ విషయం తన దృష్టికి రాలేదని, ప్రభుత్వ పాఠశాల మరుగుదొడ్ల ధ్వంసానికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు.

రోగులకు సిబ్బంది అందుబాటులో ఉండాలి


ఓపీ క్యూలైన్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్

పెనుమూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పెనుమూరు సీహెచ్‌సీలో డాక్టర్లు, వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవి అన్నారు. బుధవారం ఆమె ఆసుపత్రిని తనిఖీ చేసి పలు రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది అధికంగా సెలవు పెట్టకూడదని, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనాన్ని పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్ బాబు, హెడ్ నర్సు నిర్మలాదేవి, సంతోష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలి

పెనుమూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవన నిర్మాణాల్లో నాణ్యత తప్పక పాటించాలని పంచాయతీరాజ్ ఏఈ గురవారెడ్డి అన్నారు. బుధవారం ఆయన పెనుమూరులో నూతనంగా నిర్మిస్తున్న పలు ప్రభుత్వ భవనాలు, నూతనంగా మంజూరైన రోడ్లను పరిశీలించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నాణ్యతను పరిశీలించాలని సూచించారు. అనంతరం కేసీపల్లి సచివాలయ పరిధిలో పీజీఆర్ఎస్ వినతులపై లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రుద్రయ్య నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళీ, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


ల్యాబ్ టెక్నీషియన్‌కు సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

విజయపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన విజయపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ బుధవారం తనిఖీ నిర్వహించారు. ల్యాబ్‌ను సందర్శించి, రిజిస్టర్ చూసి ప్యాసివ్ సర్వైలెన్స్ న్యూ ఓపీడీ 15 శాతంగా, యాక్టీవ్ సర్వైలెన్స్ 100 శాతంగా ఉండాలని సూచించారు. మలేరియా రక్త పరీక్షలు పరిశీలించే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విష్ణుప్రియ, సబ్‌యూనిట్ అధికారులు శివముని, శివసుబ్రహ్మణ్యం, సీహెచ్‌వో భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్‌లకు వేతనాలివ్వాలి


నిండ్రలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

విజయపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్‌లకు వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాల్లో కనీసం 6 నెలల వేతనాలు దసరాకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య, మండల అధ్యక్షుడు రవి, జిల్లా ఉపాధ్యక్షుడు యేసుపాదం, నాయకులు ఏలుమలై, మనివేలు, సుగుణ, అమ్ములు, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టలేరా?

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం, అధికారులు అరికట్టలేరా? అని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ప్రశ్నించారు. అగ్రవర్ణాల దాడిలో గాయపడి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్న గంగవరం మండలం బూడిదపల్లె గ్రామానికి చెందిన దళిత మహిళ మునెమ్మను బుధవారం డీహెచ్‌పీఎస్ నాయకులు పరామర్శించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తికావస్తున్నా నేటికీ దళితులపై దాడులు చేయడం దారుణమన్నారు. దీనిపై అధికారులు, ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. పోలీసులు రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరించకుండా నిక్కచ్చిగా విచారణచేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సమితి నాయకులు నాగరాజు, విజయగౌరి, గజేంద్ర, జమొలాబి తదితరులు ఉన్నారు.

బియ్యం బస్తాల వితరణ


బియ్యం బస్తాలు పంపిణీ చేస్తున్న పార్థసారథి నాయుడు తదితరులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో చిత్తూరు లయన్స్ క్లబ్ సభ్యుడు పార్థసారథినాయుడు అమ్మఒడి ఆశ్రమానికి, పట్టణ నిరాశ్రయుల ఆశ్రమానికి బియ్యం బస్తాలు వితరణ చేశారు. అమ్మఒడి ఆశ్రమ నిర్వాహకుడు పద్మనాభనాయుడు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు ప్రతి పంటను నమోదు చేసుకోవాలి

తవణంపల్లె, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని ఈచనేరి, కాణిపాకపట్నం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణాధికారి కుసుమ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పీవీ పాఠశాల గుర్తింపు రద్దుపై ఆందోళన

విజయపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో పీవీ పాఠశాల గుర్తింపు రద్దుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాల ఆవరణంలో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం మధ్యలో పాఠశాలను రద్దు చేయడం ఎంత వరకు సమంజసమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజన్ కారణంగా 62 మంది అస్వస్థతకు గురైన విషయమై యాజమాన్యానికి సంబంధం లేదని ఎంఈవో, డీవైఈవోలకు తెలియజేశామన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మనోహర్‌గౌడ్‌ను బుధవారం పలువురు నేతలు కలిసి శాలువతో సన్మానించారు. సింగిల్‌విండో త్రీమెన్ కమిటీమెంబర్ బుర్రా జ్యోతియాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కామసాని కోదండరెడ్డి, నెల్లేపల్లె మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, టీడీపీనేతలు వెంకటేష్‌నాయుడు, సోమశేఖర్‌నాయుడు, చంద్రబాబుగౌడ్ పాల్గొన్నారు.

నగరి ఎంపీడీవోగా వాణి

నగరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరి ఎంపీడీవోగా కె.వాణి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న ఈమె పదోన్నతిపై నగరికి ఎంపీడీవోగా విచ్చేశారు.

సచివాలయ సిబ్బందికి పీ4పై శిక్షణ

పెనుమూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ సిబ్బందికి పీ4పై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ పరిధిలో బంగారు కుటుంబాలను వారి ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఎంపిక చేయాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● పూతలపట్టు: ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషలాఫీసర్ సూరిబాబు, ఎంపీడీవో నాగరాజు, రెడ్డిప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● పాలసముద్రం: ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందికి పీ-4 పథకంపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో సతీష్ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, జయశంకర్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ● వెదురుకుప్పం: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చంద్రమౌళి సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు.